# శాస్తి



మార్కెట్టంతా బాగా హడావిడిగా వుంది. మర్నాడు వరలక్ష్మి వ్రతం. ఊర్లో వున్న ఆడవాళ్ళంతా అక్కడే వున్నారాన్నట్లుంది! సందట్లో సడేమియాయన్నట్లు మధ్యలో కుర్రకారు. అమ్మాయిల వేట కోసమని కొందరయితే, త్రోక్కిసలాటలో మంచి 'ఛాన్సులు' కొట్టేద్దామని కొందరు, జేబులుకత్తిరించేవాళ్ళు, గొలుసులు లాగేసే వాళ్ళు- ఇలా ఎంతమందో. డిమాండు బాగా వుండడంతో షాపులవాళ్ళు మామూలు రేట్లకి రెండు మూడింతను చేసి అమ్ముతున్నారు పూజకవసరమైన వస్తువులన్నీ- దేవుడి కోసం కాబట్టి జనం కొనకుండా పోరన్న ధైర్యంతో.

మామూలప్పుడే ఆ మార్కెట్టుకి రావడం యిష్టం వుండదామెకు. కాని ప్రక్కింటి శ్యామల బలవంతం వల్ల వచ్చిందివాళ. వచ్చిన మొదలు ఆ జనాన్ని చూసి చిరచిరలాడుతూనే వుంది వెళ్ళిపోదామని. కొబ్బరి కాయలొకటే మిగిలిపోయాయి. అవి కొనేసి వెళ్ళిపోదామంటూ సమీరని కొబ్బరికాయల కొట్ల వేపు లాక్కెళ్ళింది శ్యామల. ఉన్నవి రెండే కొబ్బరి కాయల కొట్లవడంతో రెండు కొట్లూ కిట కిటలాడిపోతున్నాయి జనంతో. ఆ రష్ చూసి సమీర కొద్దిగా దూరంగా ఆగిపోయింది- శ్యామలని వెళ్ళి కాయలు కొనుక్కు రమ్మంటూ. శ్యామల రాగానే ఆ నరకం నుండి బయటపడచ్చునుకుంటూ అటూ- ఇటూ చూస్తోంది. అలా చూస్తున్న సమీరకి ఆ జనంలో షోల్డరు బాగుతో వస్తున్న స్టూడెంటు ఒకడు కన్పించాడు. అతడిని చూడ గానే ఆమె ముఖం జేవురించింది. ఆ కుర్రాడు సమీరని గుర్తించనే లేదు. తిన్నగా వెళ్ళి కొబ్బరి కాయల గుంపులో జొరపడ్డాడు. ఎందుకయినా మంచిదని అతడినే కనిపెడు తూంది సమీర. ఇదేమీ గమనించని ఆ కుర్రాడు వెళ్ళి శ్యామల పక్కగా నిలబడి, తనూ కొబ్బరికాయల కోసమన్నట్లు చెయ్యి ముందుకు చాచాడు శ్యామల వక్షస్థలాన్ని రాసుకుంటూ. శ్యామల చివ్వున తల తిప్పింది. కానీ ఏమీ తెలియనట్లుగా అతడు కాయలు బేరం చేస్తూండిపోయాడు. కాసేపయాక, ఎవరో తోసినట్టుగా శ్యామలమీదికి మరింత ఒరిగిపోయాడు- అలా పడుతూ మరో ఛాన్సు గట్టిగా కొట్టేస్తూ. శ్యామల ముఖం ఎర్రబడిపోయింది సిగ్గుతో. దూరం నుండి ఇదంతా చూస్తున్న సమీర కోపం పట్టలేకపోయింది. గబగబా వెళ్ళి అతడ్ని షర్టు కాలరు పట్టుకుని వెనక్కిలాగి చాచి లెంపకాయ కొట్టింది. అతడేదో చెప్పేలోగా, మా ఫ్రెండు మెడలో గొలుసు లాగుతున్నాడని గట్టిగా అరిచింది. అంతే- ఠపీ ఠపీ మని నాల్గయిదు గుద్దులు పడ్డాయతనిపై. రకరకాల కామెంట్సు. సమీర ధైర్యానికి అభినందనలు. తెల్లబోయిన ముఖంతో యిదంతా చూస్తోంది శ్యామల. ఇంతట్లో ఎక్కడ నుండో వచ్చాడు పోలీసు నేనూ వున్నానంటూ. అప్పటికి గొలుసులు పోయిన కంప్లయింట్స్ రెండొచ్చాయనీ, అవన్నీ ఆ కుర్రాడే కొట్టేసుంటాడని తీర్మానిస్తూ వాడి మెడ పట్టుకుని లాక్కెళ్ళాడు.

సమీర, శ్యామల మార్కెట్టు నుండి బయట పడ్డారు. ఏదో చెప్పబోయిన శ్యామలని వారిస్తూ అంది సమీర- "నాకంతా తెలుసు. ఆ రాస్కెల్ పది రోజుల క్రితం బాగా రద్దీగా వున్న సిటీబస్సులో నాతోనూ ఇలాగే ప్రవర్తించాడు. ఆడవాళ్ళం నల్గురిలోనూ మనం వాడు చేసిన పని పైకి చెప్పుకోలేమని వాడి ధైర్యం. అందుకే వాడికి బుద్ధి వచ్చేలా చేశాను. వాడి అవకాశం వాడు చూసుకుంటున్నాడు. నా అవకాశం నేను చేజిక్కించుకున్నాను. అంతేమరి. లేకపోతే ఈలోకంలో బ్రతకలేం. ఇలాంటివాళ్ళ కిలాంటి శాస్తి జరగాలి. అంతే..." అంది.

- కె.వి.ఎస్. యోగానంద్


మీ శ్రీవారూ ఓ తేనెటీగా?

పరాయి స్త్రీ కనిపిస్తే చాలు చొంగ కార్చుకుంటూ,
పక్కన భార్య వున్నదన్న విషయమే మర్చిపోయి
కళ్లు చికిలించి మరీ చూస్తుంటారా?
అయితే వారికి గుణపాఠం చెప్పి తీరాల్సిందే.
అందుకు మీరు చేయవలసిందల్లా ఒక్కటే -
త్వరలో ప్రారంభం కానున్న
'..X' క్లినిక్

సీరియల్ చదివించండి!

షోకిల్లా రాయుళ్లున్న ప్రతి ఇంటా విధిగా చదవాల్సిన సీరియల్!